టీచర్స్ సరెండర్ అన్యాయం

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్

ప్రజాశక్తి-పాడేరుటౌన్:జిల్లాలోని పెదబయలు మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులను విద్యా శాఖకు సరెండర్ చేయడం అన్యాయమని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడప-గడపకు కార్యక్రమంలో భాగంగా సంపంగిపుట్టు గ్రామాన్ని సందర్శించిన అరకు ఎమ్మెల్యే పాల్గుణకు ఉపాధ్యాయులు విధులకు హాజరు కాలేదని గ్రామస్తులు తెలిపారు. ఉపాధ్యాయులు విధులకు హాజరు కాలేదని ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ సుమిత్ కుమార్ విద్యా శాఖకు సరెండర్ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. జిఒ-3 సుప్రీంకోర్టు రద్దు చేయడంతో గిరిజన ప్రాంతంలో విద్యాపరమైన సమస్యలు అధికమవుతోందని తెలిపారు. ఉపాధ్యాయులను ప్రభుత్వానికి సరెండర్ చేసుకుంటూ పోతే గిరిజనాభివృద్ధి దెబ్బతింటుందని పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రాంతాల్లో ఉపాధ్యాయ ఉద్యోగాల్లో గిరిజనేతరులకు అవకాశం కల్పించడాన్ని తప్పుబట్టారు.

తగ్గుతున్న గోదావరి.. పెరుగుతున్న శబరి

- ★ నీట మునిగిన జాతీయ రహదారి-30
- ★ ఆంధ్ర - ఒడిశా మధ్య స్తంభించిన రవాణా
- ★ నిలిచిపోయిన లారీలు
- ★ నాటు పడవలపై ప్రయాణికుల తరలింపు

ప్రజాశక్తి- చింతూరు, ఎటపాక

పోలవరం ముంపు మండలాల ప్రజలను రెండు రోజుల పాటు తీవ్రంగా కలవరపెట్టిన గోదావరి శుక్రవారం నాటికి కాస్త శాంతించింది. గురువారం అర్ధరాత్రి భద్రాచలం వద్ద గోదావరి 45 అడుగుల వరద ప్రవాహం ఉండగా శుక్రవారం సాయంత్రానికి 42 అడుగుల వద్ద నిలకడగా ప్రవహిస్తుంది. దీంతో అధికారులు మొదటి ప్రమాదక హెచ్చరికను ఉపసంహరించారు. అయితే శబరి నది నీటి మట్టం పెరుగుతోంది. గురువారం 30 అడుగులు ఉన్న నీటి మట్టం శుక్రవారం నాటికి చత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్, సుకుమా జిల్లాలలో శబరి 33.7 అడుగులకు చేరింది.

వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు ప్రమాద స్థాయిలో పొంగి ప్రవహిస్తున్నాయి.

చింతూరు మండలం కోయగూరు వాగు వంతెన నీట మునిగిపోవడంతో గురువారం మధ్యాహ్నం నుండి శుక్రవారం వరకు రహదారులు మూసుకుపోయాయి. జాతీయ రహదారి-30 నీట మునగడంతో ఒడిశా వెళ్లాల్సిన లారీలు ఎర్రంపేటలో నిలిపివేశారు. ఆంధ్ర నుండి ఒడిశాకు వెళ్లాల్సిన ప్రయాణికులను అధికారులు నాటు పడవలపై పంపిస్తున్నారు. అయితే ఒడిశా నుంచి ఆంధ్రకు అత్యవసర వైద్య సహాయాలకు తప్ప వేరే ప్రయాణికులను పడవలపై అనుమతించడం లేదు. సోకిలేరు, చీకటి వాగులు ప్రవాహాలు తగ్గకపోవడంతో చింతూరు- విఆర్.పురం మండలాలకు రవాణా పునరుద్ధరణ కాలేదు. రెండు రోజులగా జలాదిగ్బంధంలో చిక్కుకున్న ఎటపాక మండలం వీరాయిగూడెం గ్రామాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. వరదల నేపథ్యంలో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మండలాల్లో పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. సహాయ కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నారు. వరదల నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో చింతూరు, ఎర్రంపేట ఆశ్రమ పాఠశాలల విద్యార్థులను వారి స్వస్థలాలకు పంపివేశారు. ఈ పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఎటపాక మండల పరిషత్ కార్యాలయంలో తహాశీల్దార్ వేణుగోపాల్, ప్రత్యేకాధికారి బాపన్న దొర మండల స్థాయి విపత్తు నిర్వహణ సమావేశం నిర్వహించారు. నిత్యావసరాలు, బోటు, మెడిసిన్, కిరోసిన్, ప్రజలను తరలించడానికి ట్రాక్టర్‌లకు డీజిల్ అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో వరద ముప్పు ఇంకా పొంచి ఉంది.

జాతీయ రహదారి-3పై ఎర్రంపేట వద్ద నిలిచిపోయిన లారీలు

నిత్యావసరాలు అందించాలి

వరద పెరిగితే మురుమూరు వద్ద భద్రాచలం -కూనవరం ప్రధాన రహదారి పైకి వరద నీరు చేసి రాకపోకలు నిలిచిపోతాయి. 46 అడుగులకే మురుమూరుకు చుట్టూ నీరు చేరి రవాణా నిలిచిపోతుంది. వరద సమాచారం ఎప్పటికప్పుడు గ్రామస్తులకు తెలియజేసి అప్రమత్తం చేయాలి. వరద వస్తే గ్రామస్తులు అంతా గుట్టల పైకి వెళ్లాల్సి వస్తుంది. ఆ లోపు గ్రామస్తులకు కిరోసిన్, టార్పాలిన్, పాలు, నిత్యావసరాలు అందించాలి. బోటులు అందుబాటులో ఉంచాలి.

- సోయం వీరమ్మ, సిపిఎం ఎటపాక మండల కమిటీ సభ్యురాలు

ముందస్తు చర్యలు చేపట్టాలి

రంపచోడవరం : ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాల కారణంగా గోదావరి పొంగే అవకాశం ఉంది కాబట్టి ముందస్తు చర్యలు చేపట్టాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ముంపునకు గురైనా ప్రజలను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ ఏడాది అయినా ముందస్తు చర్యలు చేపడితే ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉండదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు భూములు తోపాటు ఊర్లు కూడా త్యాగం చేస్తే నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్న ఈనాటికి కూడా ఒక్క గూడు కూడా కట్టలేదని తెలిపారు.

ఎత్తైన ప్రాంతంలో గుడారాలు నిర్మించుకుంటున్న ముంపు ప్రాంత ప్రజలు

ముంపు గ్రామాల ప్రజలపై మళ్లీ అదే నిర్లక్ష్యం..

ఎగువ ప్రాంతాల్లో సొంతంగా గుడారాలు వేసుకుంటున్న వైనం

ప్రజాశక్తి - విఆర్.పురం

2022 గోదావరి, శబరి వరద బీభత్సం కళ్ల ముందు మెదులుతున్నా, ప్రభుత్వం, అధికారులు కళ్ళు తెరవడం లేదు. ప్రస్తుతం ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి, శబరి పరీవాహక ప్రాంత గ్రామాలకు జలదిగ్బంధంలోకి వెళ్తున్నా ప్రభుత్వం, అధికారుల్లో అదే నిర్లక్ష్యం.. అదే అలసత్వం. శబరి, గోదావరి నదులు పొంగి ప్రవహిస్తుండడంతో మండలంలో పలు గ్రామాలను వరద చుట్టుముట్టింది. రహదారులు బంద్ అయ్యాయి. జీడిగుప్ప, శ్రీరామగిరి, పోచవరం, తుమ్మిలేరు, కొల్లూరు, ఇప్పూరు గ్రామాల ప్రజలు కొండలపైకి వెళ్లి తాత్కాలికంగా నివాసాలు, వెంకన్నగూడెం, రామవరం, సోపల్లి, తుష్టివారిగూడెం, పత్తిపాక ప్రజలు అడవిలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వడ్డుగూడెం, ధర్మతాలగూడెం కాలనీ ప్రజలు రేఖపల్లి పునరవాస కేంద్రాలకు వెళ్లి అక్కడ తాత్కాలంగా కర్రలతో గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. తమకు ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం అందలేదని, దోమలు ఎక్కువగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసరాలు, కనీసం కిరోషిన్, బరకాలు, కొవ్వొత్తులు ఇవ్వలేదని చెబుతున్నారు. పునరావాస ప్రాంతాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు రాలేదని చెబుతున్నారు. ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి విఆర్.పురం మండల తహాశీల్దారు కార్యాలయానికి వచ్చారే తప్ప కనీసం తమను పలకరించడానికి రాలేదని పేర్కొన్నారు.

విష సర్పాల మధ్య గడుపుతున్నాం

మేము పునరావాస కేంద్రానికి వచ్చి రెండు రోజులైంది. కనీసం ఏ అధికారీ, ఏ ఒక్క ప్రజాప్రతినిధీ రాలేదు. రాత్రులు దోమలు, విష సర్పాలు, పురుగుల మధ్య ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నాం. నిత్యావసర సరుకులు ఇవ్వలేదు. కిరోసిన్, టార్పాలిన్‌లు కూడా లేవు.

- సోడి కన్నారావు, ధర్మతాలగూడెం గ్రామం, విఆర్.పురం మండలం

ఒడ్డుగూడెంలో బాధితులను కలుసుకొని మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

వరద బాధితులకు సిపిఎం పరామర్శ

బోటులపై వెళ్లి గ్రామాలను సందర్శించిన నేతలు

ప్రజాశక్తి- విఆర్.పురం

వరదకు గ్రామం చూట్టు నీరు చేరి గుట్టల్లో గుడిసెలు వేసుకొని ఉన్న శ్రీరామగిరి ఒడ్డుగూడెం వరద బాధిత కుటుంబాలను సిపిఎం నాయకులు శుక్రవారం బోటులో వెళ్లి పరామర్శించారు. ఈ సంద్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ గోదావరి వరద వచ్చి రెండు రోజులైనా కనీసం గుట్టల్లో ఉంటున్న పోచారం, జీడిపప్పు, ఇప్పుడు రామవరం, వెంకన్న గూడెం, పునరావాస కేంద్రాల్లో ఉన్న ధర్మతాల గూడెం వడ్డుగూడెం కాలనీ, ఒడ్డుగూడెం గ్రామాలు బాధితులకు కిరోసిన్ ఇవ్వలేదని తెలిపారు. వరద తగ్గే వరకు ఆ గ్రామాలకు వారికి ఇంటికి 5 లీటర్లు చొప్పున కిరోషిన్, నిత్యావసరాలు, కూరగాయలు, బరకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎంపిపి, జెడ్‌పిటిసి పరామర్శ

ఎంపీపీ కారం లక్ష్మి, జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి ఆయా గ్రామాల ప్రజలను పలకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి వరద నివారణకు ప్రత్యేక అధికారిని నియమించాలని డిమాడ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం నాయకులు కారం సుందరయ్య, పంకు సత్తిబాబు, గుండెపూడి లక్ష్మణరావు, కమ్మిచిచ్చు సత్యనారాయణ, నాల్లారాపు ప్రకాశరావు, ఆత్మకూరి కాంతారావు, సొడే మల్లయ్య, తుమ్మలపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - చింతూరు

అధికారుల నిర్లక్ష్యంపై ఎస్‌టి కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరదలు ముందు సమీక్షా, వరదల్లో సమీక్షా, వరదలు తర్వాత సమీక్షా ఇవే అధికారుల పనులా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులను సొంత గ్రామాలకు పంపొద్దని18వ తేదీ వరకు చెప్పిన అధికారులే ఆకస్మికంగా 19న అన్ని ప్రాంతాల్లో రోడ్లు మునిగాక ఇళ్లకు పంపండి అని పాఠశాలలకు చెప్పడం దారుణమన్నారు. ప్రజలను పునరావాస కేంద్రాలకు, విద్యార్థులను ముంపులోకి పంపడం ఏమిటని ప్రశ్నించారు. ఉన్నతాధికారుల చర్యలు, లోపాలను రాష్ట్ర ప్రభుత్వానికి, జాతీయ విపత్తు సంస్థలకు, జాతీయ ఎస్‌టి కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మణిపూర్ ఘటన హేయం

ప్రజాశక్తి - హుకుంపేట:మణిపూర్‌లో బిజెపి హింసాకాండపై అల్లూరి జిల్లా కేంద్రంలో గిరిజన సంఘం, గిరిజన మహిళ సంఘం(ఐద్వా), సీఐటీయూ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, మణిపూర్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్థానిక గిరిజనుల పై తీవ్ర దాడులు చేస్తూ ముగ్గురు మహిళలను వివస్త్రను చేయడం దారుణమన్నారు. బీజేపీ ప్రభుత్వం నిందితులను వేనుకేసుకుని రావడం సరికాదని అన్నారు.మెజారిటీ గిరిజనులు క్రిస్టియన్ మతంలో ఉన్నారనే ఆక్రోశంతో బీజేపీ ప్రభుత్వ ఈ ఘటనలకు పాల్పడుతుందన్నారు. గిరిజనేతరులను ఎస్టీ జాబితాలోకి తెచ్చి ఓట్లు పొందాలని బీజేపీ ముఖ్యమంత్రి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పొద్దు బాల దేవ్ మాట్లాడుతూ, బీజేపీ పాలిత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో గిరిజనుడిపై బీజేపీ నాయకుడు మూత్రం పోసిన ఘటన మరువక ముందే, మణిపూర్ లో గిరిజనుల పై ప్రభుత్వం దాడులకు తెగబడిందన్నారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయం పై ప్రధానమంత్రి స్పందించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన మహిళ సంఘం జిల్లా అధ్యక్షులు సొంటేన హైమావతి మాట్లాడుతూ.. బీజేపీ మోడీ ప్రభుత్వం మణిపూర్ లో గిరిజనుల పై జరుగుతున్న దాడులను చోద్యం చూస్తుందన్నారు. ఎస్సి, ఎస్టీ, మైనారిటీ, వెనుకబడిన వర్గాలను టార్గెట్ చేస్తూ.. మోడీ ప్రభుత్వం హింసాను ప్రేరేపిస్తుందన్నారు.మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నడి రోడ్డు పై మహిళలకు బట్టలు లేకుండా ఊరేగింపు చేసిన మానవ మృగాలను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని అమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నేత ఎల్ సుందర్ రావు, గిరిజన సంఘం, ఐద్వా సంఘం తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మణిపూర్‌లో గిరిజన మహిళలను వివస్త్రలుగా చేసి ఊరేగించి, సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని మానవ హక్కుల నేర నిరోధక సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షుడు పి ధర్మ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, విభిన్న జాతులు, సంస్కృతి కలిగిన భారత దేశంలో ఇటువంటి అటవీక ఘటనలు జరగడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బాధితులకు కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎల దీక్ష

ప్రజాశక్తి- పెదబయలు: తహసీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు శుక్రవారం దీక్షలు చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చని విఆర్ఎలకు పదోన్నతి కల్పించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. విఆర్ఎలకు కనీస వేతనం చెల్లించాల న్నారు. నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

నినాదాలు చేస్తున్న విఆర్ఎలు

గిరిజనుల సాగు భూములను కాపాడాలి

-జెడ్‌పిటిసి, సిపిఎం నేత దీసరి గంగరాజు- ఐటిడిఎ గేట్ ఎదుట ధర్నా- పిఒకు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అనంతగిరి మండలంలో ఏళ్ల తరబడి, పూర్వీకుల నుంచి గిరిజనుల సాగులో ఉన్న భూములను లాక్కునేందుకు విజయనగరం పివిజి మహారాజులు ప్రయత్నిస్తున్నారని, అధికారులు స్పందించి వాటిని కాపాడాలని అనంతగిరి జెడ్‌పిటిసి, సిపిఎం నేత దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. గిరిజనుల పక్షాన జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్ భూములను కాపాడేందుకు చర్యలు తీసుకోకపోతే భూ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయం నుంచి ఐటిడిఎ వరకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ ఆధ్వర్యంలో నాయకులు, రైతులు శుక్రవారం నిరసన ర్యాలీ, ధర్నా చేపట్టారు. ఐటిడిఎ కార్యాలయం లోపలకు వెళ్ళేందుకు యత్నించిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు వాగ్వాదం జరిగింది. నాయకులు, రైతులు కింద కూర్చొని ధర్నా చేశారు. గిరిజనుల హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని నినాదాలు చేశారు. లోపల వెళ్లి సమస్యను అధికారులకు తెలియజేస్తామని నాయకులు విన్నవించారు. ఎస్ఐ రంజిత్ నిరాకరించి ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల అనుమతితో నాయకులను, కొద్దిమంది రైతులను లోపలికి అనుమతించారు. స్పందన కార్యక్రమంలో ఉన్న ఐటిడిఎ పిఒ వి అభిషేక్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించి సమస్యను వివరించారు. అనంతగిరి మండల పరిధిలో అనంతగిరి, ఎగువశోభ, టోకూరు, కొండిబ పంచాయితీల పరిధిలో అరకు రోడ్డును ఆనుకుని ఏళ్ల తరబడి గిరిజనులు భూములను సాగు చేస్తున్నారన్నారు. 4 పంచాయతీలు, 8 రెవెన్యూ గ్రామాల పరిధిలో గిరిజనులు సాగు చేస్తున్న సుమారు 300 ఎకరాల భూమిని విజయనగరం మహారాజుకు చెందిన కొంతమంది వ్యక్తులు వచ్చి వారి భూములు అంటున్నారని తెలిపారు. 1/70 చట్టాన్ని అతిక్రమిస్తూ 5వ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనుల సాగులో ఉన్న భూములను లాక్కునేందుకు ప్రయత్ని స్తున్నారన్నారు. భూములకు సంబంధించి తమకు అనుకూలంగా హైకోర్టు తీర్పునిచ్చిందని, ఖాళీ చేయాలని, కోర్టు ఉత్తర్వులు ప్రకారం జిల్లా కలెక్టర్ భూములను అప్పగిస్తారని గిరిజనులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పారు. గిరిజనుల తరపున కోర్టుకు అప్పీల్ చేయాలని, గిరిజనుల భూములకు రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండలానికి చెందిన ఎంపిటిసి, సిపిఎం నాయకుడు కొండలరావు, గిరిజన సంఘం నాయకులు పాలికి లక్కు, ఆర్.సుందరరావు, టోకూరు, ఎగువశోభ సర్పంచులు కిల్లో మొస్య, సింహాద్రి, భూ సాధన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సుబ్బారావు, జి.రమేష్, లక్ష్మణ్, భీమరాజు, నాగరాజు, సురేష్, రైతులు పాల్గొన్నారు.

ఐటిడిఎ గేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, గిరిజనులు

నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

కమ్ముకున్న పొగ మంచు

ప్రజాశక్తి-అనంతగిరి: అల్లూరి, విజయనగరం జిల్లాల సరిహద్దు తాటిపూడి జలశయం కొండల మధ్య పొగ మంచు పాకుతూ స్థానికులకు, అటు పర్యాటకులకు కనువిందు చేసింది. శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ కుండపోత వర్షం అనంతరం తాటిపూడి జలశయానికి ఆనుకుని ఉన్న కొండల చుట్టూ తెల్ల సముద్రం వల్లే పొగ మంచు ఆకర్షణీయంగా పాకుతూ దర్శనమిచ్చింది. ఈ ప్రకృతిఅందాలను పర్యాటకులు తమ సెల్ ఫోన్ కెమెరాలలో బంధించేందుకు ఎగబడ్డారు.

తాటిపూడి, అనంతగిరి ఎత్తైన కొండల మధ్య కమ్మిన పొగమంచు

ధ్రువపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 7,716 ధృవపత్రాలు పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల పరిధిలోని 20 సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. 15,113 గృహల నుంచి వివిధ సర్టిఫికెట్ల కోసం 15,596 వినతులు రాగా, 18,983 టోకెన్లు నమోదు చేయడం జరిగింది. 16,240 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం జరిగిందని, అందులో 7,716 సర్టిఫికెట్లు పంపిణీ చేశామని, 21 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన సర్టిఫికెట్లు రానున్న రెండు, మూడు రోజుల్లో వాలంటీర్ల ద్వారా పంపిణీ చేయటం జరుగుతుందని కలెక్టర్ వివరించారు.

నెల రోజులకే రోడ్డుకు బీటలు

బీటలు వారిన గాయిబంద రహదారి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : మండలంలోని బస్కి పంచాయితీ కాగువలస నుంచి మొర్రిగుడ గ్రామం వరకూ ఇటీవల నూతనంగా రహదారి నిర్మించారు. గాయిబంద గ్రామ సమీపంలో రహదారి వర్షానికి బాగా దెబ్బతింది. రహదారి నిర్మాణం చేసిన నెల రోజులకే రహదారి బీటలు బారిందని స్థానికులు తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

డంపింగ్ యార్డులా ఆశ్రమ పాఠశాల!

పాఠశాల ఆవరణలో చెత్తా చెదారం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల డంపింగ్ యార్డులా మారుతోంది. చెత్తను పాఠశాల ఎదురుగా ఆవరణలో పడేయడంతో అది డంపింగ్ యార్డులా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా దోమలు వ్యాప్తి చెందడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉంది. తక్షణమే పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విశాఖ ఎంపిని బర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి -సీతమ్మధార : పార్లమెంట్ సాక్షిగా సహచర ఎంపీ రఘురామకృష్ణంరాజుపై అసభ్య పదజాలంతో విరుచుకుపడి విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ విశాఖ పరువు తీశారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మండిపడ్డారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దీనిపై ఎంపీ రఘురామకృష్ణంరాజు ఇప్పటికే లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. చట్టసభల్లో ఎంవివి ప్రవర్తనను తప్పుబడుతూ జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. లోక్‌సభ స్పీకర్ స్పందించి ఎంవివిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎంవివి భూకబ్జాలు, అక్రమప్రాజెక్టులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు.

డంపింగ్ యార్డు తరలించాలని వినతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ రిజర్వాయర్‌కు ఆనుకొని ఉన్న జివిఎంసి ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును అక్కడ నుంచి తరలించాలని ఎఐవైఎఫ్ డిమాండ్ చేసింది. శుక్రవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి క్యాంపు కార్యాలయానికి వెళ్లిన ఎఐవైఎఫ్ నేతలు వినతిపత్రం అందజేసారు. అనంతరం అక్కడే ఉన్న జెడ్‌సి కనకమహాలక్ష్మికి కూడా విన్నవించారు. రిజర్వాయర్ సమీపంలో డంపింగ్ యార్డు ఉండడం వల్ల నీరు కలుషితమౌతోందని, ప్రజారోగ్యం దృష్ట్యా వెంటనే తరలించాలని కోరారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.అచ్యుతరావు, వై.రాంబాబు, సహాయ కార్యదర్శి కొమరం సందీప్, ఉపాధ్యక్షులు కెల్లా రమణ ఉన్నారు.

హెల్త్ సెక్రటరీకి మదర్ థెరిసా అవార్డు

ప్రజాశక్తి-పెందుర్తి : 94వ వార్డు ముత్యం కాలనీ సచివాలయ హెల్త్ సెక్రెటరీ ఎస్.దేముడమ్మ చేసిన సేవలకు గుర్తింపుగా మదర్ తెరిసా ట్రస్ట్ అవార్డును అందజేసింది. ఈనెల 20న ట్రస్ట్ ఎండి ఈ అవార్డును అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా దేముడమ్మ మాట్లాడుతూ తనకు అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మరింత ఉత్సాహంగా సేవలు చేసేందుకు ప్రేరణనిచ్చిందన్నారు. ఈసందర్భంగా దేముడమ్మను పలువురు అభినందించారు.

'స్పందన' సమస్యలకు సత్వర పరిష్కారం

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు 101 వినతులు అందాయి. జెసి జె.శివ శ్రీనివాసు, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్ఒ పి.అంబేద్కర్ సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. స్వీరించిన వినతి పత్రాలను సంబంధిత అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పాడేరు మండలం వంజంగి పంచాయతీ వంజంగి గ్రామం నుండి బొర్రా మామిడి వరకు బిటి రోడ్డు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. హుకుంపేట మండల పట్టం పంచాయతీ కోడితల గ్రామస్తుడు పాంగి ప్రసాదు తనకు ఇల్లు మంజూరైందని ఇంటి నిర్మాణానికి రుణం మంజూరు చేయాలని కోరారు. పాడేరు మండలం గొందూరు కాలనీకి తాగునీటి సదుపాయాలు కల్పించాలని ఎంపిటిసి సిహెచ్.చిట్టమ్మ గ్రామస్తులు ప్రమీల, రాజేశ్వరి తదితరులు కోరారు. పాడేరు మండలం గొండెలి పంచాయతీ గ్రామస్తులు కె.దొరబాబు బొక్కెళ్ల వంతెన శిధిలమైందని కొత్త వంతెన నిర్మించాలని కోరారు. పెదబయలు మండలం పెదకోడాపల్లి పంచాయతీ కొత్తపోయి పల్లి గ్రామం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతులకు గురైందని కొత్త ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని మర్రి రాజారావు, పాంగి అప్పారావు వినతిపత్రం సమర్పించారు. అనంతరం చింతపల్లి మండలానికి చెందిన 67 స్వయం సహాయ సంఘాలకు రూ.1కోటి 87 లక్షల 81 వేల చెక్కును లబ్దిదారులకు పంపిణీ చేసారు.

వ్యవసాయ డ్రోన్ల వినియోగానికి అధికారుల కసరత్తు

ప్రజాశక్తి-ఆనందపురం: వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో భాగంగా డ్రోన్లు వినియోగానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. కూలీల కొరతతో రైతులు సకాలంలో ఎరువులు, పురుగు మందులు పొలాల్లో వేసుకోలేని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఆయా పనులను ఆధునిక డ్రోన్ల సాయంతో చేపట్టేలా రైతులకు చోదోడుగా నిలవాలని నిర్ణయించారు. ఈమేరకు ఆనందపురం మండలానికి ఆరు డ్రోన్లను ప్రభుత్వం మంజూరు చేసింది.
రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆసక్తి గల ఐదుగురు రైతులు కలిసి కస్టమర్ హైరింగ్ సెంటర్ (సిహెచ్‌సి)ని ఏర్పాటు చేసుకోవాలి. అందులో ఐటిఐ లేదా ఇంటర్మీడియట్ చదివిన ఒక ఐకాన్ పైలెట్‌ను ఎన్నుకోవాలి. వీరికి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గుంటూరులో 15 రోజులపాటు శిక్షణ అందిస్తారు. సుమారు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు విలువ చేసే డ్రోన్‌ను గ్రూపు సభ్యులు 10 శాతం వాటా చెల్లిస్తే, 40 శాతం రాయితీ, 50 శాతం బ్యాంక్ రుణంతో ప్రభుత్వం సమకూరుస్తుంది. ఆ డ్రోన్లతో పొలంలో పురుగు మందులు పిచికారీతోపాటు, విత్తనాలు, జలఎరువులు కూడా చల్లడానికి వినియోగించుకోవచ్చు. రైతులు అద్దె ప్రాతిపదికన ఇతర రైతులకు డ్రోన్ల సేవలు అందించవచ్చు.
ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సంధ్యా రత్న ప్రభ మాట్లాడుతూ డ్రోన్ల వినియోగం వల్ల రైతులకు ఖర్చు తగ్గడంతో పాటు ఎక్కువ విస్తీర్ణంలో చాలా తక్కువ సమయంలో ఎరువులు, పురుగు మందులు పిచికారీకి అవకాశం ఉంటుందన్నారు. ఔత్సాహిక రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అర్హత గల వారిని ఎంపిక చేసి శిక్షణకు పంపిస్తామన్నారు.

890వ రోజుకు ఉక్కు కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం :విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో కార్మికుల రిలేదీక్షలు శుక్రవారం 890వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సెంటర్ ప్లాంట్ విభాగానికి చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు ఎన్ రామారావు మాట్లాడుతూ కూర్మనపాలెంలోని దీక్షల శిబిరం ఈనెల 31నాటికి 900 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి 10.00 గంటల వరకు అగనంపూడి, వడ్లపూడి, గంట్యాడ, ఉక్కునగరం, కూర్మన్నపాలెం, గంగవరం నిర్వాసిత కాలనీలలో పాదయాత్ర చేయాలని నిర్ణయించామన్నారు. 31న సోమవారం సాయంత్రం 4.00 గంటలకు కూర్మన్నపాలెం శిబిరం వద్ద నిరసనల్లో కార్మిక కుటుంబాలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'ఉక్కు' పాదయాత్రను జయప్రదం చేయండి

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం గాజువాక హిందుస్థాన్ జింక్ గేటు నుంచి కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం వరకూ శనివారం జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. ఉక్కు నగరంలోని సిఐటియు కార్యాలయంలో యువ కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటూ మెరుగైన వేతనాలు సాధించుకుందామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన శనివారం ఉదయం 8 గంటలకు హిందుస్థాన్ జింక్ గేటు నుండి పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. అలాగే ఈ నెల 24, 25, 26 తేదీలలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షులు వైటి.దాస్, నాయకులు బి.అప్పారావు, ఉరిటి మరిడయ్య, దాసరి శివ, పుల్లారావు, యు.అప్పలరాజు, ఎం.దానయ్య, కుమార్ రాజు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించిన హీరో సాయిధరమ్ తేజ్

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను శుక్రవారం సాయంత్రం సినీ హీరో సాయిధరమ్ తేజ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ త్రినాథ్ ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు.కప్ప స్తంభం ఆలింగనం, బేడా మండపం ప్రదక్షిణ, స్వామి అంతరాలయంలోనూ గోదాదేవి సన్నిధిలోను గోత్రనామాలతో ప్రత్యేక పూజలు అనంతరం ఆస్థాన మండపం వద్ద అర్చకులు ఆశీర్వదించగా, అధికారులు స్వామి ప్రసాదాన్ని అందించారు.

వైభవంగా అప్పన్న గరుడసేవ

సింహాచలం: అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలో భాగంగా శుక్రవారం స్వామి కల్యాణాన్ని గరుడ సేవను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు పూజల అనంతరం స్వామి ప్రసాదాన్ని అందజేశారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

-5లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు : ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఎపి ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ స్టడీ సర్కిల్ నిర్వహణలో రాష్ట్రంలోని పలు కేంద్రాల ద్వారా సివిల్ సర్వీసెస్, గ్రూప్ 1, గ్రూప్ 2 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తోందని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్హులైన ఎస్‌సి, ఎస్‌టి ఇతర కేటగిరీలకు చెందిన అభ్యర్థులు ఆగస్టు 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యూపి ఎస్ సి సివిల్ సర్వీసెస్ కు విశాఖపట్నంలోను, ఎపిపి ఎస్ సి గ్రూప్ -1 కు విజయవాడలోను, గ్రూపు 2 కు తిరుపతిలోను ఉచిత శిక్షణ అందిస్తారని చెప్పారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండి ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన వారై వార్షిక ఆదాయం రూ.6లక్షలు మించకూడదన్నారు. వయో పరిమితి 21 ఏళ్ల నుండి 32 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఐదేళ్లు, బిసిలకు మూడేళ్లు గరిష్ట వయో పరిమితి ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష, రిజర్వేషన్ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. అర్హతలు కలిగిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిఒ కోరారు.

ఆర్థిక సాయమందించి ఆదుకోండి

చికిత్స పొందుతున్న మహిళ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:గర్భసంచి సంబంధిత వ్యాధి బారిన పడి తీవ్ర అనారోగ్యంతో శృంగవరపుకోట(ఎస్ కోట)లోని కోలపర్తి ఆసుపత్రిలోచికిత్స పొందుతున్న తన భార్య శెట్టి జయకుమారి ఆరోగ్యం మెరుగుకై ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకోవాలని స్థానిక మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వినోద్ కుమార్ కోరారు. దాతలు ఆర్థిక సాయాన్ని అందించాలని కోరుతూ శుక్రవారం స్థానిక విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేశారు. గర్భసంచి వ్యాధి బారిన పడ్డ తన భార్యకు ఆపరేషన్ చేయాల్సి వస్తుందని వైద్యులు తెలిపారన్నారు. ఈ ఆపరేషన్ కు వేలాది రూపాయలు అవసరం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తాను ఆపరేషన్ కు సరిపడా నగదును చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సాయం చేసే దాతలు 6305799183 ఫోన్ నెంబరును సంప్రదించగలరని ఆయన కోరారు.

వాలంటీర్ల సహకారం తీసుకుంటే చర్యలు

ప్రజాశక్తి-పద్మనాభం : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సర్వే, సవరణ పారదర్శకంగా చేపట్టాలని తహశీల్దార్ తోట శ్రీవల్లి ఆదేశించారు. ఈ ప్రక్రియలో వాలంటీర్ల సహకారం తీసుకుంటే చర్యలు తప్పవని బిఎల్ఒలకు హెచ్చరించారు. శుక్రవారం మండల కాంప్లెక్స్‌లోని వెలుగు కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణపై బిఎల్ఒలు, వివిధ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల ధ్రువీకరణలో బిఎల్ఒలు ఎటువంటి లోపాలకు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్తఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణపై కచ్చితంగా వ్యవహరించాలని, దీనికి ఆయా బూత్‌స్థాయిలో రాజకీయనేతలు సహకరించాలని కోరారు. మండలంలో 45పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఐదుగురు సూపర్‌వైజర్లు, 45మంది బిఎల్ఒలను నియమించా మన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కె రమణ, కె లీలావతి, కె దామోదరరావు, బిజెపి నేత ఆర్ శ్రీను, పి అప్పలరమణ, వైసిపినేత ఎం.శివరామకృష్ణ, టి.పద్దు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

ప్రజాశక్తి- ములగాడ : డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, తదితర సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి, నివారణకు ప్రజలంతా సహకరించాలని జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, ఐదవ జోన్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, బయాలజిస్ట్ దాడి సాంబమూర్తి కోరార. శుక్రవారం 62వ వార్డు. దుర్గానగర్‌లో డ్రైడే-ఫ్రైడేలో పాల్గొన్నారు. వ్యాధులకు కారణమైన దోమలు, వాటి లార్వాలు వృద్ధి చెందకుండా పరిసరాల్లోనూ, ఇళ్లల్లోనూ నీరు నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.. మలేరియా ఇన్‌స్పెక్టర్ డి రవికుమార్, సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు రోమాల వేణుబాబు, డి రాజ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు, లు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆదివాసీ భాషా దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

కోయ భాషను జాతీయ భాషగా గుర్తించాలి

ప్రజాశక్తి - చింతూరు : అనేక రాష్ట్రాలలో కోయ తెగ ప్రధాన భాషగా ఉన్న కోయ భాషను జాతీయ ఆదివాసీ భాషగా గుర్తించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతూరు గిరిజన కళాశాల హాస్టల్‌లో శుక్రవారం ఆదివాసీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీ తెగలు భాషా, సంస్కృతి సంప్రదాయాలు, ప్రత్యేకతలు అనేకం ఉన్నాయని, ప్రపంచీకరణ నేపథ్యంలో ఆదివాసీ జాతి సంస్కృతి సంప్రదాయాలకు గిరిజనులు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళిక బద్ధంగా ఆదివాసీ ప్రాంతాలను, తెగలను కాపాడవలసి ఉందని, కాని ప్రభుత్వాలు మాత్రం అభివృద్ధి పేరుతో ఆదివాసీలను ఏజెన్సీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతాలకు గెంటివేస్తున్నారని విమర్శించారు. స్వచ్ఛమైన అడవి తల్లి బిడ్డలుగా పెరిగిన ఆదివాసీలు నేడు పరిశ్రమలు, ప్రాజెక్టుల పేరు మీద నిర్వాసితులుగా మారి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి తమ ఉనికిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు నష్టం చేకూర్చే చర్యలు విడనాడాలని జీవో 3ను పునరుద్ధరించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని, గిరిజన సబ్ ప్లాన్ నిధులతో ఏజెన్సీలో వ్యవసాయాభివృద్ధి, పరిశ్రమల స్థాపన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాండు నాగార్జున్, గుండి శివ, కుంజ రాజేష్, పెనుబల్లి సాగర్, గుండి వంశీ, మడకం రాంప్రసాద్, టుడే అప్పారావు పాల్గొన్నారు.

సప్పర్ల ఆశ్రమ పాఠశాల వార్డెన్ సరెండర్

ప్రజాశక్తి - సీలేరు : గూడెం కొత్తవీధి మండలం సప్పర్ల బాలుర ఆశ్రమ పాఠశాల వార్డెన్ సాగిన సత్యనారాయణను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్ కుమార్ తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడుతూ ఇటీవల జిల్లా కలెక్టర్ పర్యటన సందర్భంగా హాస్టల్లో స్టాక్ రూమును ఆయన పరిశీలించగా ఆ సమయంలో రికార్డులు ప్రకారం సరిపడా కూరగాయలు లేకపోవడం, పాఠశాల ఆవరణలో లైట్లు లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. సంబంధిత వార్డెన్ విధి నిర్వహణలో అలసత్వంపై కలెక్టర్ సీరియస్‌గా తీసుకొని సరెండర్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు.

వెరికోస్ వీన్స్‌కు అధునాతన చికిత్స

డాక్టర్ సిబ శంకర్ దలై

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కాళ్లలో సాధారణంగా పెద్దగా కనిపించే, వంకరలు తిరిగినట్టుగా వుండే ఆకుపచ్చ సిరలు వెరికోస్ వీన్స్ అని, అవి మనిషి జీవన శైలిపై గణనీయమైన ప్రభావం చూపుతాయని, దీనికి అధునాతన చికిత్స అందుబాటులో ఉందని న్యూరో వాస్క్యూలర్ ఇంటర్వెన్షన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సిబశంకర్ దలై తెలిపారు. నగరంలోని మెడికవర్ హాస్పిటల్స్‌లో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ అధునాతన చికిత్స వల్ల హాని అంతగా ఉండదన్నారు. ఆసుపత్రిలో గడిపే సమయం తగ్గుతుందని తెలిపారు. లేజర్ రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్, స్క్లెరోథెరపీ వంటివి గతంలో ఎక్కువగా వినియోగించిన చికిత్సా విధానాలని, నేడు ఎఫ్‌డిఎ ఆమోదిత ఆధునిక చికిత్స అందుబాటులో ఉందని అన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై వినతి

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కూనవరం

పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కొరకు జూలై 5న ఇరిగేషన్ మంత్రి ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 20న ప్రాజెక్ట్ అథారిటీ, పునరావాస కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్యను పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన సీపీఎం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలు వల్ల ప్రజల ఇబ్బందులు పడుతున్నారన్నారు. పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేవని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెళ్లి అయిన, చనిపోయిన వారి ప్యాకేజీ ఇచ్చే దాంట్లోని ఇబ్బందులు గురించి తెలియజేశారు. భూమికి భూమి ఇవ్వాలని, సాగునీటి వసతి కల్పించాలని కోరారు. ముంపులో వున్న భూములకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ప్రాజెక్టు వల్ల ప్రతి సంవత్సరం వచ్చే వరదలకు ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. 41 కాంటూరు లెవల్ మునుగుతున్న ప్రతి గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని పునరావాస కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వం ఇచ్చిన భూములు సేద్యానికి అనువుగా లేవని, వాటిని సరి చేయడానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు. కొన్ని భూములు చౌడు భూములుగా ఉన్నాయని, అవి ఏమాత్రం బలమైన భూములు కావని పేర్కొన్నారు. దీనికి స్పందించిన పునరావాస కలెక్టర్ సమస్యల పరిష్కారం కొరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, నాయకులు మేకల నాగేశ్వరావు, పాయం సీతారామయ్య, సీసం సురేష్, నాగేంద్ర, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సర్పంచ్ బి.వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంతులేని 'స్మార్ట్' మోసం

నిరుద్యోగులకు ఇవ్వని ఉద్యోగం - తిరిగి చెల్లించని సొమ్ము

ఒత్తిళ్లు భరించలేక మధ్యవర్తుల అవస్థలు - తాజాగా కొమ్మాదిలో దంపతుల ఆత్మహత్య

ఆత్మహత్య చేసుకున్న దంపతులు ప్రసాద్, రాజరాజేశ్వరి (ఫైల్)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

స్మార్ట్ విలేజ్ క్లస్టర్ ఎగ్జిక్యూటివ్, క్లస్టర్ అసిస్టెంట్ ఉద్యోగాలిప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయలు వసూలుచేసి ఇరికిపోయిన వారు తప్పించుకోలేక అవస్థలు పడుతున్నారు. బిజెపి నర్సీపట్నం పూర్వ ప్రధాన కార్యదర్శి, స్మార్ట్ విలేజ్ రీజనల్ మేనేజర్ ఇండిపూడి సుధాకర్ మోసాలకు నిరుద్యోగులు, అతన్ని నమ్మి డబ్బులు వసూలు చేసినవారు అనేక తిప్పలుపడుతున్నారు. రూర్బన్, స్టార్ విలేజ్ పథకం కింద నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన వారిలో పరువు, మర్యాదల్లేని కొంతమంది బహిరంగంగా తిరుగుతుండగా, ఇంకొంతమంది ముఖం చూపించుకోలేని పరిస్థితుల్లో దూరదూరంగా బతుకుతున్నారు. నిరుద్యోగుల నుంచి సుమారు 43 లక్షలు రూపాయలు వసూలుచేసి వారికి ఉద్యోగాలివ్వలేక, డబ్బులు వాపసు చేయకలేక, ఒత్తిళ్లను భరించలేక కొమ్మాది ప్రాంతంలోని దంపతులు ప్రసాద్, రాజరాజేశ్వరి ఈ నెల 19న ఆత్మహత్య చేసుకున్నారు. నిరుద్యోగుల నుంచి ఒత్తిడి పెరిగితే వీరి వలే ఎన్నో కుటుంబాలు వీధినపడే అవకాశంలేకపోలేదు. బెయిల్‌పై బయటకు వచ్చిన సుధాకర్ రహస్యంగా తన అనుచరులతో స్మార్ట్ విలేజ్ తరహా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అయినా ఈ కార్యకలాపాల నియంత్రణకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకోవడంలేదు.

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పది వేల మంది నిరుద్యోగుల నుంచి సుమారు రూ.400 కోట్ల వరకు సుధాకర్ వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇంతపెద్ద మొత్తంలో నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలుచేసిన, అందుకు సహకరించిన వ్యక్తుల నుంచి డబ్బులు రాబట్టి నిరుద్యోగులకు ఇప్పించే పని ఆది నుంచీ జరగడంలేదు. నర్సీపట్నం ప్రాంతంలో చాలా కాలం సుధాకర్‌ను పోలీసులు కాపాడారన్న విమర్శలు బలంగానే ఉన్నాయి. ఫిర్యాదులిచ్చిన నిరుద్యోగులను బెదిరించి పంపించేలా చేయడం, నచ్చజెప్పి పంపించడం వంటి పనులు పోలీసులు దగ్గరుండి చేయడంతో సుధాకర్, ఆయన అనుచరుల వసూళ్లకు అడ్డూఅదుపూ లేకుండా పోయిందని బాధితులు చెబుతున్నారు. మోసపోయిన అనేక ప్రాంతాల నిరుద్యోగులు వీధుల్లోకి రావడంతో నాడు సుధాకర్‌పై కేసు నమోదుచేయక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలుచేసి సొమ్ముచేసుకున్న వారిలో కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబ సభ్యులు, పోలీసులు వున్నట్లు విమర్శలున్నాయి. పలుకుబడి కలిగిన కొంతమంది ఈ వ్యవహారంలో భాగస్వాములు కావడంతో కొన్ని సంవత్సరాలుగా నిరుద్యోగుల నుంచి డబ్బుల వసూళ్ల వ్యవహారం సాగుతున్నప్పటికీ అడ్డుకట్ట వేయాల్సిన వారంతా మౌనందాల్చి లాభపడగా, ఉద్యోగం ఆశతో డబ్బులిచ్చిన నిరుద్యోగులు మోసపోయారు.

నిరసన తెలుపుతున్న ఐద్వా కార్యకర్తలు

మణిపూర్ ఘటనపై ఐద్వా నిరసన

ప్రజాశక్తి - విఆర్.పురం : మణిపూర్‌లో గిరిజన తెగకు చెందిన మహిళలను వివస్త్రలను చేసి, ఊరేగించి, అత్యాచారం చేసి, హత్య చేసిన సంఘటనపై అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఎటపాక మండలం గుండాల కాలనీ గ్రామంలో శుక్రవారం ఐద్వారా ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి ఐ.పద్మావతి మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన ఈ సంఘటన బిజెపి పాలనలో భారతదేశంలోని మహిళల స్థితిని కళ్ళకు కట్టినట్లు చూపించిందని పేర్కొన్నారు. దేశంలో ఏదో ఒక మూల, ఎక్కడో ఒక చోట వయసుతో సంబంధం లేకుండా మహిళలపై హింసా, అత్యాచారాలు, హత్యలు, వేధింపులు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భరత మాతలను నడివీధిలో నగ్నంగా ఊరేగించే మానవ మృగాలు, కామ పిశాచీలు యథేచ్ఛగా సంచరించే దేశంలో మనం బతుకుతున్నామని పేర్కొన్నారు. మే 4వ తేదీన ఈ ఘటన జరిగితే నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. దేశంలో మహిళల రక్షణకు ముందుకు రాకపోతే బిజెపి పాలకుల పుణ్యామా అని మన ప్రాంతంలో కూడా ఇటువంటి ఘటనలు జరుగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తోట రమణ, తోట వెంకటరమణ, ఆదిలక్ష్మి, శారద, శాంతి, సుమిత్ర, మాధురి, నవ్య తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ తొలగింపు

ప్రజాశక్తి - సీలేరు : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి కన్నబ్బాయి క్యాంపు వాలంటీర్లు బాబులాల్ అలియాస్ అనిల్‌ను విధుల నుండి తొలగించినట్లు సీలేరు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వాలంటీరు బాబూలాల్ జులై నెల పింఛన్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో, లబ్ధిదారులు పత్రికా ముఖంగా తమ గోడును వెల్లబుచ్చిన నేపథ్యంలో బాబూలాల్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎంపీడీవో ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఆయన స్వాహ చేసిన పింఛన్ల సొమ్మును రికవరీ చేసి లబ్ధిదారులకు శుక్రవారం సర్పంచి, ఎంపీటీసీ సమక్షంలో పంపిణీ చేశామని చెప్పారు. ప్రభుత్వ ట్యాబ్‌ను రికవరీ చేయాల్సి ఉందని తెలిపారు. అలాగే మరో వారంటీరు గోపి వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్లు వెల్లడించారు.

'ప్రశ్నలకు బదులేది' కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యూరు : జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి వంపురి గంగులయ్య వైసిపి ప్రభుత్వంపై 12 ప్రశ్నలతో ప్రచురించిన ప్రశ్నలకు బదులేది కరపత్రాలను ఆ పార్టీ కార్యకర్తలు శుక్రవారం ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సాగిన బుజ్జి బాబు, గూడెం లక్ష్మణ్, సెగే భావన, సాయి, జయంతి, వాసం సాయిబాబు, గోకిరి శీను బాబు, కంచం సాయి పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యుత్ కార్మికులకు పిఆర్‌సి ప్రకటించకుండా 15 మాసాలుగా చర్చల పేరుతో యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం దారుణమని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యారావు అన్నారు. విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే విద్యుత్ కార్మికుల సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం ఎపిఇపిడిసిఎల్ సర్కిల్ కార్యాలయం వద్ద సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.